
సోమవారం 30-09-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 471 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
దినపత్రిక
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



స్నేహపూర్వకంగా ఉంటే సాయం చేసేవాళ్లం

మిగతా 2లో




ముదిరిన రీల్స్ పిచ్చి.. సైన్‌బోర్డుపై పుల్ అప్స్

మిగతా 3లో



గుండెపోట్లు పురుషుల్లోనే ఎక్కువ..

మిగతా 3లో




ఆధార్, పాన్‌కార్డ్ సమాచారం లీక్ అవుతోంది..

మిగతా 5లో

## కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ నినాదాలు

### వీటిపై కాంగ్రెస్ ఎందుకు మాట్లాడడం లేదు

### రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డ అమిత్ షా





**ముందడుగు హరియాణా:**

కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు పెరుగుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ కాంగ్రెస్ నిర్వహిస్తున్న సభల్లో ఈ నినాదాలు లేవనెత్తుతున్నారని ఆయన అన్నారు. బాద్షాపుర్ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్‌కు కంటిమీద కునుకులేకుండా పోయిందన్నారు.

మిగతా 2లో



## ప్రసంగిస్తుండగా అస్వస్థతకు గురైన ఖర్గే

### అయినప్పటికీ ప్రసంగాన్ని మాత్రం ఆపలేదు

### మోడీని గద్దె దించే వరకు అలసిపోనంటూ వ్యాఖ్యలు

**ముందడుగు జమ్మూకశ్మీర్:**

జమ్మూకశ్మీర్‌లోని కరువా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అనూహ్య సంఘటన జరిగింది. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వేదికపై అస్వస్థతకు గురయ్యారు. ప్రసంగిస్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోబోయారు. దీంతో అక్కడున్న నేతలు ఆయన్ను పట్టుకున్నారు. వెంటనే ఖర్గేకు నీరు తాగించారు. అయినప్పటికీ ఆయన ప్రసంగాన్ని మాత్రం ఆపలేదు. పార్టీ నేతలు ఆయనను పట్టుకుని నిలబడి ఉండగా.. ప్రసంగాన్ని కొనసాగించారు.

మిగతా 2లో

## పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ వ్యాపారం

### ధన, ప్రాణ, ఆస్తులు కాపాడటం ప్రభుత్వం బాధ్యత

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముందడుగు తెలంగాణ:**

పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ధన, ప్రాణ, ఆస్తులు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, అందులో భాగంగా చెరువులను రక్షించి, భవిష్యత్తు తరాలకు అందించేందుకు

మిగతా 2లో



## మా రాష్ట్రాన్ని వరదలు వణికిస్తున్నాయి


### కేంద్రం నుంచి ఏలాంటి సహాయం అందట్లేదు

### ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన

**ముందడుగు పశ్చిమబెంగాల్:**

పశ్చిమబెంగాల్ ఉత్తరాది జిల్లాలను వరదలు వణికిస్తున్నాయి. రాష్ట్రంలో వరదల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి కేంద్రం నుంచి తమ రాష్ట్రానికి ఎటువంటి

మిగతా 2లో



ముందడుగు
సోమవారం, 30-09-2024, హైదరాబాద్

# హెజ్‌బొల్లా మరో కీలక నేత హతం


## ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందిన నబిల్ కౌక్



**ముందడుగు జాతీయం:**

ఇజ్రాయెల్ ఆదివారం జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లాకు చెందిన మరో కీలక నేత నబిల్ కౌక్ హతమయ్యాడు. హెజ్‌బొల్లా సెంట్రల్ కౌన్సిల్‌లో డిప్యూటీ హెడ్‌గా ఉన్న నబిల్ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. అయితే, దీనిపై హెజ్‌బొల్లా నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

గత కొన్ని వారాలుగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న భీకరదాడుల్లో హెజ్‌బొల్లాకు చెందిన పలువురు సీనియర్ కమాండర్లు హతమైన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన దాడిలో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా (64) మృతి చెందడం ఆ గ్రూపునకు శరాఘాతంలా మారింది. ఈ తరుణంలోనే మరో కీలక నేతను కోల్పోవడం గమనార్హం. నబిల్ 1995 నుంచి 2010 వరకు సౌత్ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలటరీ కమాండర్‌గా పనిచేశాడు. 2020లో అతడిపై అమెరికా ఆంక్షలు విధించింది.



# స్నేహపూర్వకంగా ఉంటే సాయం చేసేవాళ్లం

## పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు

**ముందడుగు జాతీయం:**

భారత్‌తో పాకిస్థాన్ సత్సంబంధాలు కొనసాగించి ఉంటే.. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి ఇస్లామాబాద్ కోరిన దానికంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీని ఇచ్చే వాళ్లమని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆర్టికల్ 370' రద్దుపై అక్కసుతో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించేందుకు యత్నిస్తోందని, ఇక్కడ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోవడం ఆ దేశానికి ఇష్టం లేదన్నారు.

"201415లో జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. అది ఇప్పుడు రూ.90 వేల కోట్లకు చేరుకుంది. ఐఎంఎఫ్ నుంచి పాకిస్థాన్ కోరిన బెయిల్‌అవుట్ ప్యాకేజీ కంటే ఇది చాలా పెద్దది. ఒకవేళ ఆ దేశం స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించి ఉంటే ఐఎంఎఫ్ కంటే ఎక్కువే సాయం చేసే వాళ్లం" అని గురేజ్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పొరుగు దేశం చాలా కాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోందని, తన భూభాగంపై ఉగ్ర కార్యకలాపాల నిర్వహణకు ఇతర దేశాల నుంచి డబ్బు అడుగుతోందని ఆరోపించారు.



## ప్రభుత్వాలు ప్రజలకు భరోసాగా ఉండాలి

ప్రజాస్వామ్యంలో ప్రజలే అధిపతులు. ప్రజలకు సేవ చేసేందుకు, వారి అవసరాలు తీర్చేందుకే ప్రభుత్వాలు, అధికారులు ఉన్నారు. అలాంటిది ప్రజల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు ప్రజలకు భరోసా ఇవ్వాలి. ప్రక్షాళన చేసే ముందు అందుకు సంబంధించిన లాభ, నష్టాలపై ముందు ఆ ప్రాంత ప్రజలకు వివరించాలి. అంతేకాని అధికారం ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఓట్లసిన ప్రజల పరిస్థితి ఏంటి..? దీని వలన ఆందోళనలు, ఉద్యమాలు తీవ్రమయ్యే అవకాశం లేకపోదు. అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదు. ప్రజలతో మనం అవలంభించే విధానాలు శాశ్వతం..

- రాజేంద్ర, ఫౌండర్ యూత్ ఫర్ యాంటీ కరప్షన్

# కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ నినాదాలు

(మొదటిపేజీ తరువాయి)

"హరియాణాలో కొత్త ట్రెండ్ చూస్తున్నాను. హతిన్ నుంచి థానేసర్ వరకు, థానేసర్ నుంచి పల్వల్ వరకు పాకిస్థాన్ అనుకూల నినాదాలు మిన్నంటుతున్నాయి. మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి నినాదాలు చేస్తుంటే ఎందుకు మాట్లాడకుండా ఉంటున్నారు?" అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఆర్టికల్ 370కి తిరిగి తీసుకొస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీపై ఆయన విరుచుకుపడ్డారు. "కశ్మీర్ మనదా? కాదా? ఆర్టికల్ 370ని తొలగించడం సరైందా? కాదా? ఈ ఆర్టికల్‌ను మళ్లీ తీసుకొస్తామని కాంగ్రెస్, రాహుల్‌లు చెబుతున్నారు. రాహుల్ గాంధీ.. మరో మూడు తరాలు మారినా దీన్ని వెనక్కి తీసుకురాలేవు. కశ్మీర్‌ను రక్షించేందుకు హరియాణా యువత ఎన్నో త్యాగాలు చేశారు. వాటిని వృథా కానివ్వం" అని అమిత్ షా అన్నారు.

# పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ వ్యాపారం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపటిన ట్లు చెప్పారు. మూసీ నదిలో మంచినీరు పారించడం, పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వాటిని వినియోగిస్తామన్నారు. కాలిఫోర్నియాలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మా రాష్ట్రాన్ని వరదలు వణికిస్తున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

సహాయం అందట్లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్న ఉత్తరాది జిల్లాలను పరిశీలించిన ముఖ్యమంత్రి.. సహాయ చర్యలకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. "ఉత్తర బెంగాల్ వరదలతో కొట్టుమిట్టాడుతోంది. కూచ్ బెహార్, జల్పాయిగుడి.. తదితర జిల్లాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోశి నది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ఇతర జిల్లాలు కూడా అతలాకుతలం అవుతున్నాయి" అని ఆమె అన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయాన్ని అందించట్లేదన్నారు. ఫరక్కా బ్యారేజీ నిర్వహణ పనులను సైతం చేపట్టట్లేదని..దాని వల్ల అందులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రసంగిస్తుండగా అస్వస్థతకు గురైన ఖర్గే

(మొదటిపేజీ తరువాయి)

"జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి తీసుకువస్తాం. అందుకోసం పోరాడుతూనే ఉంటాం. ఎనిమిది పదుల వయసులో ఉన్న నేను.. అప్పుడే చనిపోను. మోదీ సర్కార్‌ను గద్దె దించే వరకు అలసిపోను. అప్పటివరకు బతికే ఉంటా" అని వ్యాఖ్యానించారు.

ఆయన అస్వస్థతకు గురైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వెంటనే పార్టీ అగ్రనాయకత్వం జమ్మూకశ్మీర్ నేతలను అప్రమత్తంగా ఉండమని సూచించింది. అనంతరం వైద్య బృందానికి సమాచారం అందించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని ఏడు జిల్లాల పరిధిలో తొలివిడత కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగు నమోదు అయింది. రెండోవిడత పోలింగ్ ఆరు జిల్లాల్లోని 26 నియోజకవర్గాల్లో పూర్తికాగా.. మూడో విడత పోలింగ్‌కు జమ్మూకశ్మీర్ సిద్ధమైంది.

ముందడుగు
సోమవారం, 30-09-2024, హైదరాబాద్

## ముదిరిన రీల్స్ పిచ్చి..

# సైన్‌బోర్డుపై పుల్ అప్స్

### జాతీయ రహదారిపై ప్రమాదకర స్టంట్లు




**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు కోసం చాలా మంది తెగ ఆరాటపడుతున్నారు. అందుకోసం ప్రమాదకర స్టంట్‌లు చేస్తూ లైకుల కోసం ప్రాణాలకు తెగిస్తున్నారు. ఇలాంటి ఘటనే ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటు చేసుకొంది. రహదారిపై ఉండే సైన్‌బోర్డు పైకి ఎక్కి ఓ యువకుడు పుల్ అప్స్ తీస్తున్న వీడియో వైరల్‌గా మారింది.

అమేఠీలోని జాతీయ రహదారిపై ఓ యువకుడు ప్రమాదకర స్టంట్లకు పాల్పడ్డాడు. రోడ్డుపై ఉండే సైన్‌బోర్డు పైకి ఎక్కి పుల్ అప్స్ తీశాడు. నేల నుంచి 10 మీటర్లకుపైగా ఎత్తులో వేలాడుతూ స్టంట్లు చేశాడు. మరో యువకుడు కూడా పైకి ఎక్కి అతడిని వీడియో తీశాడు. ఏ మాత్రం పట్టు జారినా ప్రాణాలు ప్రమాదంలో పడేవి. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఇలాంటి స్టంట్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ట్రాన్స్ జెండర్ల కోసం

# మైత్రి క్లినిక్స్ ఏర్పాటు

### తెలంగాణ ప్రభుత్వం శుభవార్త




**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలోని ట్రాన్స్ జెండర్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ట్రాన్స్ జెండర్ల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించేందుకు మైత్రి క్లినిక్ పేరుతో.. ప్రత్యేక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాధారణంగానే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మహిళలు, పురుషుల కోసం వైద్య సేవలు అందిస్తుంటారు. అయితే.. ట్రాన్స్ జెండర్లు.. మాత్రం తమకు వచ్చే అనారోగ్య సమస్యలకు వైద్యం చేయించుకునేందుకు గానీ.. వారికి వైద్యం చేసేందుకు వైద్యులు గానీ.. సంశయిస్తుంటారు. అలాంటి ఇబ్బంది ఉండకూడదని భావించిన ప్రభుత్వం.. ట్రాన్స్ జెండర్ల కోసం మైత్రి క్లినిక్ పేరుతో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న అన్ని ఆస్పత్రుల్లో ఈ మైత్రి క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ మైత్రి క్లినిక్‌లో సేవలందించేందుకు గానూ.. ప్రత్యేకంగా వైద్యులను నియమిస్తున్నారు. మొత్తం ఐదుగురు డాక్టర్లను నియమించటమే కాకుండా వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇందులో గైనకాలజిస్ట్, స్కిన్ స్పెషలిస్ట్, మానసిక వైద్యుడు, జనరల్ ఫిజిషియన్‌తో పాటు ఓ నర్సు కూడా ఉంటారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులోనే.. ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. వైద్యులు రాసిచ్చే మందులను తీసుకునేందుకు కూడా ప్రత్యేకంగా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ట్రాన్స్ జెండర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గుండెపోట్లు పురుషుల్లోనే ఎక్కువ..

### గుండె జబ్బుల్లో హార్మోన్లదే ముఖ్యపాత్ర.. ఆహారపు అలవాట్లు, జీవనశైలి ప్రధాన కారణం

**ముందడుగు ఆరోగ్యం:**

ప్రస్తుత సమాజంలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ గుండెపోటు బారిన పడుతున్నారు. కాని స్త్రీల కన్నా పురుషులే ఎక్కువగా గుండె వ్యాధుల బారిన పడుతుండటం చూస్తున్నాం. గుండెపోటు మరణాలు వంటివి పురుషులకే ఎక్కువగా వస్తుంటాయి. అయితే, దీనికి జీవసంబంధమైన, హార్మోన్, జీవనశైలి అలవాట్లు కూడా కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. కార్డియో వాక్యులర్ డిసీసెస్ ఏడాదికి 17.9 మిలియన్ల మరణాలకు కారణమవుతున్నాయి. స్త్రీలతో పోలిస్తే పురుషులు చాలా తరుచుగా చిన్న వయసులోనే ఈ జబ్బులబారిన పడుతున్నారు.

#### హార్మోన్లే ప్రధాన కారణం

హార్మోన్లు, జీవనశైలి, జన్యు సంబంధ కారణాలు స్త్రీలు గుండె జబ్బుల బారిన పడకుండా కాపాడుతున్నాయి. గుండె జబ్బుల్లో హార్మోన్లు చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి. మెనోపాజ్‌కి ముందు మహిళల్లో ఈస్ట్రోజెన్ అనే హార్మోన్, స్త్రీలలో కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తోంది. రక్తనాళాల్లో అవరోధాలు ఏర్పడకుండా రక్షిస్తుంది. ఫలితంగా గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తోంది.

#### పురుషుల ఆహారపు అలవాట్లు

పురుషుల్లో ఈస్ట్రోజన్ అనే హార్మోన్ అనేది ఉత్పత్తి కాదు. దీంతో గుండె పరిస్థితులను చక్కదిద్దే అవకాశం ఉండదు. మరోవైపు ధూమపానం, అనారోగ్యమైకరమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణాలు కూడా మగవారిలో గుండె వ్యాధులకు కారణమవుతుంది. స్మోకింగ్ ధూమపానం కరోనరీ ధమనులపై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఇది ధమనులు కుచించుకుపోవడానికి కారణమవుతుంది. దీంతో గుండెకు రక్తప్రసరణ తగ్గుతుంది. గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. స్త్రీలతో పోలిస్తే స్మోకింగ్ అలవాటు పురుషుల్లోనే ఎక్కువ. పురుషులు కూడా అధిక స్థాయిలో ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ ("చెడు" కొలెస్ట్రాల్) కలిగి ఉంటారు, ఇది ధమని అడ్డంకులకు దోహదం చేస్తుంది.



ముందడుగు
సోమవారం, 30-09-2024, హైదరాబాద్

# 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్

## అన్ని రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య శాఖ సూచన





**ముందడుగు జాతీయం:**

70ఏళ్లు, ఆ పైబడిన వారందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ప్రయోజనాలు కల్పించడంలో భాగంగా అర్హులైన వారి పేర్లను నమోదు ప్రక్రియ చేపట్టాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ అదనపు కార్యదర్శి ఎల్ఎస్ చాంగ్సన్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు.

ఈ పథకంతో ప్రయోజనం పొందాలనుకునే సీనియర్ సిటిజన్ల నమోదు కోసం ఆయుష్మాన్ మొబైల్ యాప్, వెబ్‌సైట్‌లో (Beneficiary.nha.gov.in) ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీటిలో నమోదు చేసుకున్న అర్హులందరికీ ప్రత్యేకంగా ఆయుష్మాన్ కార్డులు జారీ చేస్తామని తెలిపింది. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పథకం కూడా త్వరలోనే అమల్లోకి వస్తుందని పేర్కొంది.

ఇప్పటికే ఏబీ పీఎంజేఏవై కింద లబ్ధి పొందుతున్న కుటుంబాలతోపాటు ఇప్పటివరకు ఈ పథకం కింద లేని వారికీ ఇది వర్తిస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. 70ఏళ్ల వయసు ఉండటమే ఇందుకు అర్హతని స్పష్టం చేసింది. ఇతర బీమా పథకాల్లో లబ్ధిదారులు కొనసాగుతున్న వారు కూడా దీని ద్వారా ప్రయోజనం పొందవచ్చని సూచించింది.



శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా

# వాల్గో ఇన్‌ఫ్రా 5G, డేటా సేవలు ప్రారంభం

## ప్రారంభించిన కర్నాటక సీఎం సిద్ధరామయ్య

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ నగరానికి చెందిన వాల్గో ఇన్‌ఫ్రా సంస్థ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మైసూర్ మెడికల్ కాలేజీలో వాల్గో ఇన్‌ఫ్రా 5జీ నెట్‌వర్క్ మరియు డేటా సేవలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభించారు. వాల్గో ఇన్‌ఫ్రా సిఈఓ, ఎండీ నెం.1 శ్రీధర్ రావు, వైద్య విద్య మంత్రి శరణ్ పి ప్రకాష్, సుజాతా రాథోడ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డాక్టర్ కె.ఆర్‌బు. వంటి గౌరవనీయ అతిథుల సమక్షంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రారంభించబడింది. దాక్షాయణి మైసూర్ మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డీన్, మరియు అనేక ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి వైద్య విద్య మంత్రి శరణ్ పి. ప్రకాష్, సుజాత రాథోడ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, మైసూర్ మెడికల్ కాలేజీ, డాక్టర్ కె.ఆర్. దాక్షాయణి మైసూర్ మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డీన్, మహదేవప్ప ఇంచార్జి మంత్రి, నాగేంద్ర KR పేట్ జెడ్పీ చైర్‌పర్సన్, హరీష్ గౌడ ఎమ్మెల్యే, మైసూర్ డిఐజీ మరియు కలెక్టర్, మరియు కర్ణాటకలోని అన్ని హాస్పిటల్ డీన్‌లు పాల్గొన్నారు.

అశ్లీల వీడియోలు చూడాలని బలవంతపెట్టాడు..

# డైరెక్టర్‌పై నటి సంచలన ఆరోపణలు..!



**ముందడుగు:**

మలయాళ చిత్ర పరిశ్రమలో వేధింపుల పై జస్టిస్ హేమా కమిటీ సంచలన నివేదిక బయట పెట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇండస్ట్రీలో పలువురు నటీమణులు తాము లైంగిక వేధింపులకు గురయ్యాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ నటులపై కేసులు సైతం నమోదయ్యాయి. తాజాగా డైరెక్టర్ బాలచంద్ర మీనన్‌పై నటి మిను మునీర్ సంచలన ఆరోపణలు చేశారు. తనను డైరెక్టర్ అశ్లీల వీడియోలు చూడాలంటూ బలవంతపెట్టారని.. తాను ఆ వీడియోలు చూడనని చెప్పానన్నారు. ఈ విషయాన్ని ఆమె ఫేస్ బుక్ పోస్ట్‌లో వెల్లడించారు. 2007 సంవత్సరం నాటి వేధింపులను ఆమె సోషల్ మీడియా పోస్ట్‌లో గుర్తు చేశారు. డైరెక్టర్ ఆయన గదిలోనే ముగ్గురు యువతులతో అశ్లీల వీడియోలు చూస్తున్నారని.. అదే సమయంలో తాను ఆయన గదిలోకి వెళ్లానని చెప్పింది. తనను చూసిన ఆయన వీడియోలను చూసేందుకు రావాలన్నాడని.. తాను అందుకు అంగీకరించలేదని.. వెంటనే ఆ గదిలో నుంచి బయటకు వచ్చేశానని చెప్పుకొచ్చింది. 2013లోనూ మళ్లీ ఇలాంటి వేధింపులో ఎదురయ్యాయన్నారు.

# సాంస్కృతిక వారసత్వంతో దాండియా మస్తీ 2024

**ముందడుగు హైదరాబాద్:**

సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వంతో పాటు, అగ్రశ్రేణి కళాకారుల ప్రత్యక్ష డిజె ప్రదర్శనలు అందించేందుకు ప్రముఖ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ జాంటీ హ్యాట్ అదివారం కొండాపూర్ మాయా లగ్జరీ కన్వెన్షన్‌లో "దాండియా మస్తీ 2024" ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో "దేవర" హిట్ మూవీలో నటించిన ప్రఖ్యాత నటి బిందు నూతక్కి మరియు జాంటీ హ్యాట్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు దీపికా బాజి రెడ్డి పాల్గొన్నారు. రాబోయే సాంస్కృతిక కోలాహలానికి వేదికను ఏర్పాటు చేస్తూ ఎంతో కోలాహలం మధ్య వైబ్రెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీపికా బాజి రెడ్డి మాట్లాడుతూ దాండియా మస్తీ 2024 2వ ఎడిషన్, 2024 అక్టోబరు 3 నుండి 12వ తేదీ వరకు మాయా లగ్జరీ కన్వెన్షన్‌లో జరుగుతుందని తన ఉత్సాహాన్ని పంచుకున్నారు. నగరంలోని అగ్రశ్రేణి కళాకారుల ప్రత్యక్ష డిజె ప్రదర్శనలు, ఆకర్షణీయమైన ప్రత్యక్ష ధోల్ ప్రదర్శన మరియు విభిన్న శ్రేణి ఫుడ్ స్టాల్స్‌తో సహా ఈవెంట్ కోసం ప్లాన్ చేసిన ఉత్తేజకరమైన కార్యకలాపాలపై వివరించారు. దాండియా మస్తీ 2024 టిక్కెట్‌లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ధరలు ₹299 నుండి ప్రారంభమవుతాయి. ఆసక్తి గల వ్యక్తులు రిజిస్ట్రేషన్లు మరియు పాస్‌ల కోసం 97041 00162 నంబర్‌ను సంప్రదించవచ్చు

ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరించిన జాంటీ హ్యాట్






# ఆధార్, పాన్‌కార్డ్ సమాచారం లీక్ అవుతోంది..

## ఈ రెండు వెబ్‌సైట్లతో జాగ్రత్త.. చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం

ముందడుగు ప్రత్యేకం:

ఇంటర్నెట్ విచ్చలవిడిగా పెరిగిపోవడంతో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతోంది.. సైబర్ మోసాలతో పాటు మనిషికి సంబంధించిన ఆధార్, పాన్‌కార్డ్ అత్యంత కీలకమైన డాక్యుమెంట్స్ కూడా లీక్ అవుతున్నాయి. వీటిలో పౌరుల వ్యక్తిగత, అడ్రస్ వంటి సున్నితమైన సమాచారం ఉంటుంది. అందుకే భారత ప్రభుత్వం పౌరుల పాన్‌కార్డ్, ఆధార్ కార్డుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అయినప్పటికీ అప్పుడప్పుడు పౌరుల వ్యక్తిగత సమాచారం లీక్ అవుతున్న ఘటనలు చోటుచేసుకుంటాయి. ఇటీవల కొన్ని వెబ్‌సైట్స్ పౌరుల ఆధార్ కార్డ్, పాన్ వివరాలను బహిర్గతం చేసినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో వాటిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

### వెలుగులోకి తెచ్చిన వెంచర్ క్యాపిటలిస్ట్

మనీకంట్రోల్ రిపోర్ట్ ప్రకారం.. ఇండియన్ ఏరోస్పేస్ అండ్ ఇంజినీరింగ్, ది స్టార్ కిడ్జ్ అనే రెండు వెబ్‌సైట్స్ ఇటీవల పౌరుల ఆధార్ డేటాను బహిర్గతం చేస్తున్నట్లు గుర్తించారు. సెప్టెంబర్ 26 వరకు ఇండియన్ ఏరోస్పేస్ అండ్ ఇంజినీరింగ్ వెబ్‌సైట్ పౌరుల వ్యక్తిగత డేటాను బహిర్గతం చేస్తే, స్టార్ కిడ్జ్ వెబ్‌సైట్ పిల్లల ఆధార్ వివరాలను షేర్ చేసింది. ఒక వెంచర్ క్యాపిటలిస్ట్ సోషల్ మీడియాలో ఈ విషయాన్ని ప్రస్తావించడంతో ఇది వెలుగులోకి వచ్చింది.

### వ్యక్తిగత సమాచారం లీక్ అయినట్లు నిర్ధారణ

ఈ ఘటనపై యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ దర్యాప్తు చేసి పౌరుల ఆధార్, పాన్ వివరాలు లీక్ అయినట్లు నిర్ధారించాయి. దీంతో ఇండియన్ ఏరోస్పేస్ అండ్ ఇంజినీరింగ్, స్టార్ కిడ్జ్ వెబ్‌సైట్లపై బ్యాన్ విధించారు. ఈ రెండు వెబ్‌సైట్లు ఆధార్‌లోని సెక్షన్ 29(4) (ఆర్థిక, ఇతర రాయితీలు, ప్రయోజనాలు, సేవల లక్ష్యం డెలివరీ) నిబంధనను ఉల్లంఘించాయని స్పష్టం చేసింది.

### తీవ్రంగా పరిగణిస్తూ బ్యాన్ చేశాం

ఈ అంశంపై ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన చేసింది. 'బహిరంగ, సురక్షితమైన, విశ్వసనీయమైన, జవాబుదారీ ఇంటర్నెట్‌ను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పౌరుల ఆధార్, పాన్ వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని కొన్ని వెబ్‌సైట్స్ బహిర్గతం చేస్తున్నాయని మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి వాటిపై



బ్యాన్ విధించాం. పౌరుల వ్యక్తిగత సమాచారం భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఐటీ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

### భద్రతా లోపాల నివారణకు సూచనలు

ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ పౌరుల ఆధార్, పాన్ వివరాలు లీక్ అయిన ఇండియన్ ఏరోస్పేస్ అండ్ ఇంజనీరింగ్, ది స్టార్ కిడ్స్ సంస్థల వెబ్‌సైట్లను పరిశీలించింది. వాటిలో ఉన్న భద్రతా లోపాలను గుర్తించి నివారణ చర్యలను సూచించింది. వెబ్ సైట్లలో ఐసీటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లను పటిష్టం చేయడం, వల్నరబిలిటీస్ పరిష్కరించడంలో వాటి యాజమాన్యాలకు అవసరమైన మార్గదర్శకత్వం చేసింది.

